

కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

పురాణాలూ - కొన్ని పేర్లూ!

పిల్లలకి కెబిసి చూపించండి, అమితాబ్ బచ్చన్ బోలెడు ప్రశ్నలు వేస్తాడు. ఆ సమాధానాలు విని, వీళ్ళకి కూడా జ్ఞానం పెరుగుతుంది. లేదా రామాయణం, భారతం, శివలీలలూ ఏదో ఒక ఛానెల్‌లో వస్తూనే వుంటాయి చూపించండి. పిల్లలకి బోలెడు సంగతులు తెలుస్తాయి.

మేం సాధారణంగా కెబిసి చూసినప్పుడల్లా అనుకునే మాట. సౌత్ ఇండియా నుండి వెళ్ళిన వాళ్ళకి పురాణ జ్ఞానం వుంటుంది. నార్త్ ఇండియా వాళ్ళకి తక్కువ వుంటుంది. ముఖ్యంగా తెలుగు వాళ్ళకి బాగా పురాణాలు తెలుస్తాయి. కారణం ఎన్.టి రామారావు. ఆయన చెయిన్‌గా చేసిన కృష్ణావతారం, కృష్ణార్జున యుద్ధం, నర్తనశాల లాంటి కథలున్న సినిమాలు. అవన్నీ చిన్నతనంలో చూసాం కాబట్టి, మాయాబజార్‌లో బలరాముడి భార్య రేవతీ, దుర్యోధనుడి భార్య భానుమతీ అని తెలిసింది. లేకపోతే పాపం వీళ్ళ భార్యల గురించి ఎవరికి తెలుస్తుందీ? వాళ్ళేం యుద్ధాలు చేసారా? శపధాలు చేసారా? అలాగే నకుల సహదేవుల గురించి కూడా జాలేస్తుంది. వాళ్ళు పాండవుల్లో వున్నా ఎక్కువ డైలాగ్స్ వుండవు. అన్నలన్న దానికి 'సరే' అంటారు. ఆ పాత్రలు వేసే నటుల మీద కూడా చాలా జాలేస్తుంది. వీళ్ళకీ రెండు లవ్ స్టోరీస్ పెట్టచ్చుగా సినిమాలు తీసేవాళ్ళు. వాళ్ళు మహా నిష్క్రమణందాకా వుంటారు కథలో, కానీ వాళ్ళ పెళ్ళాల పేర్లూ, పిల్లల పేర్లూ మనకి తెలీనే తెలీవు. (పండితులకి తెలిసేవుంటాయి. మనం అంటే సామాన్యులం) అలాగే ఊర్మిళ , మాండవికా, శృతకీర్తీ, వీళ్ళకీ సెపరేట్ లవ్ స్టోరీస్ లేవు. రాముడు విల్లు విరిచి, జానకిని పెళ్ళాడాడు, పెళ్ళికి ముందు రోజు ఆవిడ ఆయన సౌందర్యం, కిటికీలోంచి చూసింది. వీళ్ళ సంగతో మరీ? అక్క పెద్దవాడ్ని చేసుకుంది కాబట్టి 'కిమ్' అనుకండా మిగతా ముగ్గుర్నీ వీళ్ళు చేసుకోవాల్సి వచ్చిందా? కనీసం ఊర్మిళ పధ్నాలుగేళ్ళు నిద్రపోయింది కాబట్టి, ఆవిడ్ని మనం తలచుకుంటాం. "ఏమిటే అంత నిద్ర? ఊర్మిళలా అని" అందుకే సినీతారలకి కూడా ఆవిడ పేర్లు కనిపిస్తాయి. ఎవరికీ 'మాండవిక' అని పేరు పెట్టినట్లు నాకు కనిపించలేదు. కానీ శృతకీర్తి వుంటుంది. నేనే ఒక నవలలో పెట్టాను కూడానూ.

నార్త్‌లో కొన్ని చోట్ల దుర్యోధన్ అనే పేరు వుంటుంది. గుళ్ళో ఒక రోజు ఒకతను ఆ పేరు చెప్పి పూజ చేయించుకోవడం విని, అతన్ని ఎక్కడివాడు అని అడిగితే 'హిమాచల్ ప్రదేశ్' అని చెప్పాడు. అక్కడ 'హిడంబా దేవతకాబట్టి, మొక్కుకుని, ఆడపిల్ల పుడితే హిడింబ అని పెట్టుకుంటారేమో! అలాగే ఈ కెబిసీకి వచ్చేవాళ్ళల్లోనే 'అంగద్', జాంబవంత్‌లాంటి పేర్లు కూడా విన్నాను. సినిమాలలో సైతం ఈ జాంబవంతుడూ, తుంబరుడూ, హనుమంతుడూ వేషాలు వేసే వాళ్ళంటే నాకు జాలి. అంతెందుకు 'భక్త ప్రహ్లాద'లో ఎంతో ఇంపార్టెంట్ అయిన 'నరసింహుడు' పాత్రధారి కూడా ఎవరో మనకి చెపితే తప్ప తెలిసే అవకాశంలేదు.

మనకి రాక్షస స్త్రీలలో త్రిజట గురించి తెలుసు. అంతమందిలో ఆవిడకి ఒక కల రావడం వల్ల మనకి ఆవిడ పాత్ర గుర్తుంటుంది. ఇంక 'మంధర' ఈ పేరు ఎవరికీ వుండదు. పూతన, కైక, లంఖిణి, సింహిని, తాటకి అని ఎవరికీ పేర్లు పెట్టరు. పాపం మండోదరి ఎంత మంచిదీ? అయినా ఆ పేరు పెట్టడం నేను వినలేదు. కానీ లీలావతి, ఈవిడ పాత్ర మండోదరి లాంటిదే. హిరణ్యకసిపుడి భార్య అయినా ఆ పేరు పెట్టుకుంటారు. అలాగే తార పేరు పెట్టుకుంటారు. రుమ పేరు కూడా పెట్టుకుంటారు. సువర్చల ఈవిడ పేరిట గుడులలో పూజలు సైతం జరుగుతాయి. సువర్చలా సైత ఆంజనేయ నమః' అంటారు. "వల్లీ, దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి" అనే "శ్రీదేవీ భూదేవీ సహిత గణపతి నమః" అనీ వీరికి, బ్రహ్మచారి దేవుళ్ళు అనుకుంటున్న వారికి సైతం భార్యల పేర్లు ముందు రావలసిందే అని శాస్త్రం చెప్తుంది. నిజంగా భార్యల పేర్లు ముందు రాకపోతే వాళ్ళకి అంత 'వెయిట్' వుండదేమో! సీతారాములు, రాధాకృష్ణులు (భార్యకాకపోయినా, ఆవిడకి ప్రత్యేకత) ఉమా మహేశ్వరుడు, లక్ష్మీ నారాయణులు మాదిరిగా. అందుకే మనమూ భర్తల పేర్లు చివరని పెట్టుకోడం మొదలు పెట్టాం. ఆడపిల్ల తండ్రి పేరూ, పెళ్ళి అయ్యాక భర్త పేరూనూ. పురాణాలలో కూడా హిమవంతుడి పుత్రి హైమవతి. ద్రుపదుడి కూతురు ద్రౌపది, జనకుడి కూతురు జానకి, ఇలా అనమాట. అప్పట్లో ఇంటిపేర్లు లేవు కాబట్టి బతికిపోయాం. కొన్ని ఇంటిపేర్లు బావుండవు వినడానికి 'పెంట', 'దొడ్ల' లాంటివి. ఇప్పుడు 'దొడ్ల' పాలు ఫేమస్ తెలుగునాట.

చరిత్రలో కూడా కృష్ణదేవరాయలూ, శ్రీనాథుడూ, తిక్కనా, ఎర్రాప్రగడా, నన్నయ్యా, మనుమ సిద్ధీ, తిమ్మరుసూలాంటివే బట్టీపట్టడం కష్టం కాబట్టి, వారి ఇంటి పేర్లు రాయలేదేమో! 'రెడ్డి రాజులు' అని చదువుకున్నాం, అలా వేరే కులాల పేరుతో లేరు క్షత్రియులే రాజులయ్యేవారు, కాబట్టి ఇది కులం కాదేమో. రావ్ బహద్దూర్ లాగా అనుకుంటున్నాను. కొన్నిసార్లు మాన్యాలు బ్రాహ్మలకి కూడా ఇచ్చినట్టు చదువుకున్నాం. ఒక తెగ బ్రాహ్మలు నియోగి బ్రాహ్మలయి, కరణీకం చేసారు. వాళ్ళ ఇంటిపేరు 'రాజు'తో వుంటుంది. బహుశా పౌరోహిత్యం చెయ్యక పోవడం, నియోగించబడడ వల్ల అయి వుంటుంది. సామాన్యంగా 'రాజు' పేరు చాలామందికి వుంటుంది. ఏ దేశానికో కాదు, వారికి వారే రాజులు. పేరు అందంగా సులభంగా వుంటుందని పెట్టుకుంటారేమో. చివరికి కష్టసాధ్యమయిన 'విష్వక్సేనుడు' కూడా ఇప్పుడు ఫేషన్ అయింది. ఇంక 'హరిశ్చంద్రరావ్' లాంటి పేర్లూ, 'కరణ్' లాంటి పేర్లూ పెట్టుకుంటే, జీవితంలో వారికి

అబద్ధం ఆడే ఛాన్సూ, ఎవరైనా అప్పు అడిగితే 'లేదు' అనే అవకాశం కష్టమేమో! శ్రీలంకలో 'రావణాసుర్' అనీ కుంబకర్ణ అనీ పెట్టుకుంటారో లేదో తెలీదు కానీ, రణ సూర్యా, జయ సూర్యా లాంటివి పెట్టుకుంటారు. ఇంక మలేషియా, బ్యాంకాక్, ధాయ్‌లండ్‌లలో 'సుమిత్రా' 'సువర్ణా' లాంటి పేర్లు వినిపిస్తాయి.

సిక్కుమతం అనేది పూర్తిగా వేరు. వారి దైవం వేరు అయినప్పటికీ, పార్వతీ, లక్ష్మీ, కౌసల్యా, రాధా లాంటి పేర్లు సర్దార్జీ ఇళ్ళల్లో విన్నాను. (వారితో విష్యం అందాను కాబట్టి చెప్పగలను).

ఇంక ఎంతో మంచి కృపామణీ, దయా, ప్రభూ లాంటి పేర్లు ఒక మతంలోనే ఎక్కువ.

అలాగే వినత. ఈవిడ గరుత్మంతుడి తల్లి. ఈవిడ పేరు పెట్టుకుంటారు కానీ, కద్రువ అని సర్పాల తల్లి పేరు తక్కువ పెట్టుకుంటారు. అలాగే నారదుడి వీణ 'మహతి' పేరు వింటాం కానీ సరస్వతీ దేవి వీణ 'కచ్ఛపి' పేరు తక్కువ వింటాం. అంతెందుకు గొప్ప కేరక్టర్ విదురుడు, ఆ పేరు తక్కువే వింటాం దుశ్శాసనుడి పేరు కూడా పెట్టుకోరు, అతను ద్రౌపదిని జుట్టు పట్టుకుని సభలోకి లాక్కు రావడం మంచి డ్రామా సీన్ కాబట్టి, మనందరి మనసుల్లో అతని విలనిజం నాటుకుపోయింది. అలాగే శిశుపాలుడూ, జరాసంధుడూ, కంసుడూ పెట్టినప్పుడు వారి తల్లితండ్రులు ఆ కాలంలో మంచి పేర్లనే వెతికి, ఆలోచించి పెట్టి వుంటారు. తర్వాత కథలద్వారా అవి చెడు పాత్రలని తెలుసుకున్నాం. సీత, రాధ, రుమ, శచీదేవి, ఇలా పేర్లు పెట్టిన తల్లితండ్రులు అప్పట్లోనే మోడ్రన్ అన్నమాట. అసలు అప్పట్లో అప్పల నరసమ్మా, 'సుబ్బమ్మ ' అనే పేర్లు లేనే లేవు. అప్పడగు నరసింహస్వామి, ఆ పేరులో నుండి అప్పయ్యా, నరసమ్మా ఇలా మనవాళ్ళు పెట్టుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు అక్కడి నుండి సుబ్బారాయుడూ, సుబ్బలక్ష్మీ, సుబ్బమ్మా, ఇలా 'వెంకట రమణుడు' నుండి వెంకటమ్మా, రమణమ్మా లాంటి పేర్లు పెట్టుకున్నారు .'రమణుడు' ఎంత అందంగా వుందీ. అలాగే పెట్టచ్చుగా.

మందారమాల, శుక్తమతి, ఖడ్గమాల, మాధవి, మణిమేఖల, శర్మిష్ట, ఇళ, ఇలా చాలా అందమైన పేర్లు కూడా మనం పురాణాలు చదువుతుంటే వస్తాయి. పిల్లలకి పేర్లు పెట్టేటప్పుడు ఆలోచించండి. అర్థం పర్థంలేని వంధ్యా, రోమా, ష్యామా, నీమా.. లాంటివి యతీప్రాసా కోసం పెట్టేస్తున్నారు. కొన్నింటి అర్థాలు తెలుసుకుంటే బావుండవు.

పురాణాలు చదవండి. మంచి సూక్తులూ, నీతులుతోబాటు పేర్లూ వాటి ప్రాశస్త్యం తెలుస్తాయి.

Post your comments





